క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

టీపీసీసీ కార్యదర్శి జానకీరామ్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ప్రకటించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజ్‌కుమార్, శివగళ్ల యాదయ్య, సమత, రాజు, సుందర్, మహేశ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమ బడ్జెట్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పేదల సంక్షేమానికేనని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పుర కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్‌తో రాష్ట్రంలోని అని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. పురపాలక సంఘాలకు రూ.17,677 కోట్ల నిధులను కేటాయించారని, దీని ద్వారా రాష్ట్రంలోని పురపాలికలు అభివృద్ధి చెందుతాయన్నారు.

పేదల సంతోషమే దేవేందర్‌గౌడ్ ఆశయం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్



కంటి ఆపరేషన్ చేయించుకున్న వారిని పరామర్శిస్తున్న తూళ్ల బ్రదర్స్

తుక్కుగూడ: నిరుపేదలు సంతోషంగా ఉండటమే మా తండ్రి దేవేందర్‌గౌడ్ ఆశయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 18న మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి నగరంలోని శంకర్ కంటి ఆస్పత్రిలో 60 మందికి శస్త్ర చికిత్స(ఆపరేషన్) చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వారిని పరామర్శించి, మనో ధైర్యం తెలిపామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తూళ్ల విజేయందర్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై నజర్



ఇంటి పన్నుల వసూలులో పాల్గొన్న కమిషనర్ పి.సరస్వతి, అధికారులు

బడంగ్‌పేట్: ఇంటి పన్నుల లక్ష్యాన్ని ఛేదించడం కోసం అధికారులు ఇబ్బంది పడుతున్నారు. పన్నులు కట్టకుండా మొండికేస్తున్న యజమానులకు అవగాహన కల్పించి వసూలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గురువారం కమిషనర్ పి.సరస్వతి, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, బిల్ కలెక్టర్లతో కలిసి అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో, అలాగే గుర్రంగూడలోని పలు కాలనీల్లో బకాయిపడ్డ ఇళ్లను టార్గెట్ చేసుకొని పన్నులు కట్టించేలా ముందుకు సాగుతున్నారు. మొండికేసిన యజమానుల డ్రైనేజీ లైన్లను బంద్ చేయిస్తున్నారు. టార్గెట్ చేరుకోవడానికి కేవలం 10 రోజుల సమయమే అధికారులకు మిగిలి ఉంది. ఇప్పటి వరకు రూ.17 కోట్ల 6లక్షలు వసూలు చేశారు. 52 శాతం వసూలును అధిగమించారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

చేవెళ్ల: ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డు కార్యాలయం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో నగరంలోని యశోద ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 185 మంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించామని, అసవరమైన వారికి మందులు అందజేశామని వైద్యులు పేర్కొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

లక్ష్యం చేరుకునేందుకు అధికారుల కసరత్తు

- నిరంతరం నర్సరీల పర్యవేక్షణ
- లక్ష్యం 1.10 లక్షల మొక్కలు



గ్రీన్ హోం నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

మహేదీషరీఫ్: పర్యావరణ పరిరక్షణ, ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా పుష్కర కాలం క్రితం హరిత హారం పేరుతో ప్రారంభించిన కార్యక్రమం.. వన మహోత్సవంతో ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే జూలై 1 నుంచి ప్రారంభం కానున్న ద్వితీయ వన మహోత్సవానికి ఇప్పటి నుంచే జల్‌పల్లి మున్సిపల్ అధికారులు కార్యాచరణ చేపట్టారు. లక్ష్యం మేరకు నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచుతున్నారు.

నర్సరీల సంఖ్య పెంపు..

హరితహారం తొలినాళ్లల్లో ఇక్కడ నర్సరీ లేకపోవడంతో జీహెచ్‌ఎంసీని ఆశ్రయించి మొక్కలు దిగుమతి చేసుకునేవారు. స్థానికంగా నర్సరీ ఏర్పాటు చేసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటగా గ్రీన్‌హోం వెంచర్లో నర్సరీని ఏర్పాటు చేసి, పొదుపు సంఘాల మహిళలకు కాంట్రాక్ట్ కింద మొక్కల పెంపకం బాధ్యత అప్పగించారు. ఆ మొక్కలు సరిపోకపోవడంతో అదనంగా పుర కార్యాలయంలోనే మరో నర్సరీ ఏర్పాటు చేశారు. ఇలా రెండు నర్సరీలలో గతేడాది ఏకంగా లక్ష మొక్కలను పెంచారు.

లక్ష్యం1.10 లక్షలు

మున్సిపాలిటీ పరిధి వన మహోత్సవానికి 1.10 లక్షల మొక్కలు నాటడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు సంబంధిత అధికారులు ఇప్పటి నుంచే స్థలాలను అన్వేషిస్తున్నారు. పాఠశాలల ఆవరణలు, యూత్ క్లబ్‌లు, శ్రీశైలం హైవే డివైడర్, రోడ్లకు ఇరువైపులా, ఆర్‌సీఐ రోడ్డుతో పాటు వార్డుల్లో ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. పూలు, పండ్లు, ఔషధ, నీడనిచ్చే తదితర మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

సంరక్షణ ముఖ్యం

ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను మినహాయిస్తే బహిరంగ ప్రదేశాల్లో నాటిన వాటి సంరక్షణ బాధ్యతను మున్సిపాలిటీ అధికారులే తీసుకుంటున్నారు. ఇందుకోసం విశ్రాంత ఎఫ్‌ఆర్‌ఓ ఎం.వి.సుధీర్ మహోత్సవ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఎప్పటికప్పుడు మొక్కల కలుపు, పాదులు తీసి, వాటర్ ట్యాంకుల ద్వారా నీరు పోయడం, ఎక్కడైనా మొక్క ఎండపోయినట్లయితే దాని స్థానంలో వెంటనే కొత్తది నాటేలా చర్యలు తీసుకుంటున్నారు.

మియావాకి విధానం

గ్రామీణ ప్రాంత ఖాళీ స్థలాలు మొక్కలు నాటేందుకు అనువుగా ఉంటాయి. కానీ పట్టణ ప్రాంతాల్లో స్థలం తక్కువగా ఉన్న నేపథ్యంలో మియావాకి విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తక్కువ స్థలంలోనే ఎక్కువ మొక్కలు నాటి అడవుల్లా పెంచే జపాన్ పద్ధతి (మియావాకి) లో.. గతంలో జల్‌పల్లి కమాన్ రోడ్డులోని అటవీ భూమిలో ఆ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆ ప్రాంతం పెద్ద అడవిలా తలపిస్తోంది.

బృహత్తర కార్యక్రమం



బహిరంగ ప్రదేశాల్లో నాటుతున్న మొక్కలకు ట్రీ గార్డ్‌తో పాటు ఊతకర్రను ఏర్పాటు చేస్తున్నారు. ఆ సామగ్రిని కూడా ఇంటింటికీ అందిస్తే బాగుంటుంది. అడవుల నరికివేతతో గడ్డు పరిస్థితులు తలెత్తకుండా మొక్కలు నాటి, వాతావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వాయు కాలుష్యానికి మారుపేరైన మున్సిపాలిటీలో మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– చింతకింది నవీన్ గౌడ్, జల్‌పల్లి

ప్రతి మొక్కను సంరక్షించేలా



ఎన్ని మొక్కలు నాటామన్నది కాదు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. వన మహోత్సవ లక్ష్యాన్ని ఏటేటా పెంచుతూ పచ్చదనంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రజల సహకారంతో లక్ష్యం చేరుకుంటున్నాం. మానవాళి మనుగడుకు జీవనాధారమైన మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– బి.వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి

బీసీ రిజర్వేషన్ హర్షణీయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కేఎల్లార్ తదితరులు

తుక్కుగూడ: రాష్ట్రంలో అట్టగుడు వర్గాల అభివృద్ధికి 42 శాతం రిజర్వేషన్ అమలు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడ పుర కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం పార్టీ శ్రేణులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ రాజకీయ, ఉద్యోగ, విద్యా విధానంలో లభిస్తుందన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసిన రిజర్వేషన్‌ను అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ 42 శాతం రిజర్వేషన్, రాజీవ్ యువవికాసం ఈ మూడు చరిత్రలో నిలిచిపోతయన్నారు. వీటికి ప్రభుత్వం చట్ట భద్రత కలిపిస్తుందని పేర్కొన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, జానకీరామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు పాండురంగారెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సమత తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ చేయొద్దు

సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

కందుకూరు: ఫ్యూచర్ సిటీ పేరుతో బలవంతపు భూసేకరణ చేయొద్దని, రైతుల సమ్మతం లేకుండా చేస్తే ఉపేక్షించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో భూబాధితుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూసేకరణ 2013 చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్‌లో ధరకు మూడు రెట్లు అధికంగా ఇవ్వడంతో పాటు రైతులను అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులను ఒప్పించి భూములు తీసుకోవాలన్నారు. గతంలో ఫార్మాసిటీ పేరుతో చేసిన భూసేకరణలో అసలు రైతులకు కాకుండా బోగస్ పేర్లతో రాజకీయ నాయకులు కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ చేపట్టి నిజానిజాలు తెలుసుకొని డబ్బులు రికవరీ చేయాలన్నారు. ఫోర్త్‌సిటీ, ఫార్మాసిటీ పేర్లతో భూములు సేకరించి బడా కంపెనీలకు ధారాదత్తం చేయడానికే చూస్తున్నారే తప్పా రైతులకు ఒరిగేది ఏమీలేదని పేర్కొన్నారు. కంపెనీల కోసం భూములు తీసుకుంటే గ్రామ సభలు పెట్టి ఎంత నష్టపరిహారం ఇస్తారో రైతులకు చెప్పి, వారి ఇష్టప్రకారం భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోపక్క పరిహారం ఇవ్వకుండానే రైతుల భూములను ఆన్‌లైన్‌లో బ్లాక్ లిస్టులో పెట్టి ఇబ్బంది పెడుతున్నారన్నారు. భూములు కోల్పోతున్న గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో పర్యటించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. 25 నుంచి జీపు జాతా, 27న రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావిచెట్టు చందు, నోముల నర్సింహ, గౌర శ్రీశైలం, సాతూరి కృష్ణ, చిత్ర నర్సింహ, బుడ్డీరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డితో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామ ఇందిరమ్మ కమిటీ చైర్మన్ బండ నర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించిన బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ఎదురుదాడికి దిగుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెజార్టీ స్థానాలు గెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకత విధానాల పట్ల కలిసికట్టుగా అందరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో చిట్టి శ్రీకాంత్, కాసుల వెంకటేశ్, చిట్టి శ్రీను పలువురు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మహేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ పాల్కం బాలయ్య, మాజీ వార్డు సభ్యులు వరికుప్పల జగన్, నాయకులు వెంకటేశ్, తడకల మహేశ్, టిల్లు, బాబు పలువురు పాల్గొన్నారు.

200 పనిదినాలు కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజుకు రూ.600 కూలీతో పాటు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరు జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుమార్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని నేదునూరులో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలుగా పని చేస్తున్న పేద కుటుంబాల్లో నలుగురు పనిచేస్తే ఒక్కొక్కరికి కేవలం 25రోజుల పని దినాలు మాత్రమే పనులు చేయాల్సి వస్తోందన్నారు. ఆ సంఖ్యను 200 రోజులకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పని ముట్లు, ప్లేస్లిప్పులు ఇవ్వాలని, ఫొటో తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశంలో నీడతో పాటు తాగునీటి వసతిని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై పోరాడుదాం

- గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాయక్



రానునాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మీర్‌పేట: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు రానునాయక్ స్ఫూర్తితో గిరిజన సమస్యలపై పోరాడుదామని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివనాయక్ పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని సీపీఐ మండల కార్యాలయంలో జటోత్ రానునాయక్ 76వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివనాయక్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం రానునాయక్ పోరాటాలు చేశారని గుర్తుచేశారు. భూ పోరాటాలు చేసి నిరుపేద గిరిజనులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. త్వరలోనే చందన చెరువు కట్టపై రానునాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సమాఖ్య మండల అధ్యక్షుడు రెడ్యానాయక్, ప్రధాన కార్యదర్శి చత్రునాయక్, కేతావత్ శ్రీనునాయక్, దత్తునాయక్, సోమ్లానాయక్, రాంజీనాయక్, రఘునాయక్, శీను, శంకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పదికి సర్వం సిద్ధం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



మీర్‌పేట: జిల్లెలగూడ పరీక్షా కేంద్రంలో బెంచీలపై హాల్ టికెట్ స్టిక్కర్లు వేస్తున్న ఉపాధ్యాయులు



కందుకూరు: కందుకూరు నోబుల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ



బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సరస్వతి

మహేశ్వరం: పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహేశ్వరం మండలంలోని మొత్తం 1304 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకుగాను మండలంలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. గురువారం మండల విద్యాధికారి కస్న నాయక్ పరీక్షా కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతుల కల్పనపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతవరణంలో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలని కోరారు.

మొత్తం 20 పరీక్షా కేంద్రాలు

మీర్‌పేట: పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని బాలాపూర్ మండల విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. మండలంలో మొత్తం 20 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 4500లకు పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా హాల్ టికెట్ నెంబర్లు చూసుకునేందుకు వీలుగా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని పేర్కొన్నారు.

ప్రశాతంగా పరీక్షలను నిర్వహించాలి

తుక్కుగూడ: పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. గురువారం తుక్కుగూడ పుర కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పరీక్షా కేంద్రం వద్ద ఉన్న మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.విద్యార్థులు ప్రశాంత వాతవరణంలో పరీక్షలు రాసేలా చూడాలన్నారు. మేనేజర్ పర్వతాలు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

కందుకూరు: పదో తరగతి పరీక్షలకు కందుకూరు మండలంలోని పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో కలిపి మొత్తం 791 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుంచి మరో 124 మంది విద్యార్థులు కలిపి మొత్తం 915 మంది పది పరీక్షలు రాయనున్నారని, పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నర్సింహ తెలిపారు.

సెంటర్ల పరిశీలన

బడంగ్‌పేట్: నేటి నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇందుకుగాను కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి గురువారం పరిశీలించారు. బడంగ్‌పేట, బాలాపూర్, నాదర్‌గుల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఇతర సిబ్బంది ఉన్నారు.

తెరుచుకున్న మున్సిపల్ పార్కు గేట్లు

సాక్షి ఎఫెక్ట్..

బడంగ్‌పేట్: సుందరీకరణ సరే.. సందర్శన భాగ్యం ఏదీ? శీర్షికన గురువారం ప్రచురితమైన సాక్షి కథనానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి స్పందించారు. కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన బట్టీల్‌గుట్ట పార్కును అందరూ సందర్శించేలా గేట్లు ఓపెన్ చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ పి.సరస్వతి, డిప్యూటీ డీఈఈ వెంకన్న ఇతర అధికారులు, మాజీ కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి విచ్చేసి పార్కుకు ఉన్న రెండు వైపుల ఉన్న గేట్లను తెరిచారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, అలాగే సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు పార్కును తెరిచే ఉంచుతామని కమిషనర్ సరస్వతి తెలిపారు. వేసవికాలం అయిపోగానే టైమింగ్‌లో తేడాలుంటాయన్నారు. పార్కును శుభ్రంగా ఉంటేందుకు అలాగే వచ్చిపోయే సందర్శకులను అదుపుచేసేందుకు రోజు రెండు షిఫ్టుల్లో ఇద్దరేసి చొప్పున అటెండర్లను కార్పొరేషన్ నుంచి నియమిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్కును పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సందర్శకులు సహకరించాలన్నారు. ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాంక్రీట్ జంగిల్‌లో ఆహ్లాదకరమైన పార్కును సందర్శించేలా ఏర్పాట్లు చేసిన సాక్షి కథనానికి స్థానికులు, పలు కాలనీ వాసులు, సందర్శకులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

- ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: హస్తినాపూరం గిరిజన కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాత్లావత్ అంద్యానాయక్, నేనావత్ రాజు నాయక్ మాట్లాడారు. శంకుస్థాపన కార్యక్రమంలో జరిగిన గొడవ కారణంగా.. సుజాతతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడారని ఆరోపించారు. ఎస్టీ మహిళ కాబట్టే ఆయన అలా మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మెల్యే ఇంటి ఎదటు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంగోత్ కృష్ణా నాయక్, మునావత్ పాండు పాయక్, దస్రు నాయక్, గోపాల్ నాయక్, రవి నాయక్, సేవ్యా నాయక్ పలువురు పాల్గొన్నారు.

ఇంటివద్దకే రామయ్య తలంబ్రాలు

ఆర్టీసీ షాద్‌నగర్ డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలం శ్రీసీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ సంస్థ భక్తుల ఇంటివద్దకే అందిస్తుందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం ఉష కోరారు. గురువారం పట్టణానికి చెందిన మల్లికార్జున్ స్వామివారి తలంబ్రాలను బుక్ చేసుకున్నాడు. ఈ సందర్భంగా డీఎం ఉష మాట్లాడుతూ.. భద్రాచలంలో శ్రీసీతారాములు కల్యాణానికి వెళ్లలేని భక్తులకు తలంబ్రాలను ఇంటి వద్దనే అందించేందుకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాములోరి తలంబ్రాలు ప్రతి ఇంటికి చేరాలనే ఆలోచనతో ఆర్టీసీ సంస్థ భక్తులకు ఈ అవకాశాన్ని కల్పిస్తుందని, తలంబ్రాలు కావాల్సిన భక్తులు రూ.151 చెల్లించి బస్టాండ్ ఆవరణలో గల కార్గో కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దనే అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం కల్పించిన ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.